# కొత్త రచయితలు: సూరీడు చూడని వెలుగు

—డాక్టర్ యశస్వి



**సీత, సారీ సీతే, ఇంటి ముందున్న వేప చెట్టు కింద కుర్చీలో దిగులుగా కూర్చుని వుంది.**

**ఇప్పటి ఆమె పరిస్థితి రామాయణంలో అశోక వృక్షం కింద సీత 'సీను'కి ఏమాత్రం తీసిపోదు.**

చూడగానే బాగుంది అనిపించే సీత అందం విచార వదనంతో వెల వెల బోతోంది.

మధ్యతరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన సీతకు పరిస్థితులు కష్ట సుఖాలు రెండింటినీ 'స్పూను' తో తినిపించాయి. అయితే వాటన్నిటినీ కుటుంబంలో అందరితో పంచుకొనేది. కానీ ఇవాళ ఈ సమస్య తన వ్యక్తిగతం. మొదటిసారిగా–ఇరవై ఏళ్ళలో.

సీత ఆలోచనలు కాంతి వేగంతో పోటీ పడి పరిగెత్తి సడెన్ గా తన 'అమ్మమ్మ' దగ్గర ఆగిపోయాయి.

'అవును తన సమస్యకు కారణం ముసల్దే' అనుకుంటూ అసహనంగా కుర్చీలోంచి లేచి ఇంట్లోకెళ్ళబోయిన సీతకు ఎదురైంది అమ్మమ్మ.

తెల్లని తెలుపు. వయసులో ఇంకెంత అందంగా వుండేదో అనిపించే డెబ్బయి ఏళ్ళ ముదుసలి. పాత ఆచారాలకు బలి అయిపోయిన వెంట్రుకలు తెల్లని ముసుగులో బలవంతంగా కప్పబడినట్లున్నాయి. తీసిన శుక్లాలకు చిహ్నంగా నల్లని కళ్ళజోడు. చర్మంపై ముడతలు ఆమె అనుభవాల పంటల్లో చాళ్ళులా కనిపిస్తున్నాయి.

"ఏమేవ్! నువు ఇక్కడున్నావా? త్వరగా తెములు. చూపులకు పెళ్ళి కొడుకు ఒక్కడే వస్తున్నాడుట్లే"

సీత కోపంగా అమ్మమ్మ కేసి చూసింది 'నా సంగతి నీకెందుకన్నట్లు.

"నోర్మూసుకుని చెప్పిన పని చెయ్యి" కోపంతో ఎర్రబడిన ఆమె ముఖం చూసి భయపడి ఇంట్లోకి వెళ్ళింది సీత.

అరగంట తర్వాత—

పెళ్ళి కొడుకు అని పిలవబడే అతని ముందు చాపమీద సీత.

కాజువల్ గా అతనికేసి చూసింది.

ఉబ్బు కళ్ళు, ఏడు నెలల కడుపు.

'రంగు రంగుల' పెళ్ళి చూపుల్లో తిన్న టిఫెన్ల ఫలితమే అతని ఆకారమనిపించి లోలోపల నవ్వుకుంది సీత.

అసలు జీవితంలో పెళ్ళి చూపులే అక్కర్లేకుండా తన పెళ్ళి జరిగిపోతుందని కలలు కన్న సీత జీవితంలో ఇదొక మలుపు.

తను అతి త్వరగా తన మనో ఫలకంపై నుండి తుడిపేసుకొనే సంఘటనల్లోకి ఈ తతంగాన్ని కూడా చేర్చి తాపీగా కూర్చుంది.

"మీరేం చదువుకున్నారు"

గరగరమంటూ సీత చెవులను తాకింది అతని ప్రశ్న.

'ఓహో! సంతలో బేరానికి శ్రీకారం చుట్టినట్లున్నాడు.'

''బి.ఎ. బిఇడి'' చెప్పింది ముక్తసరిగా.

గరగరలతో మరో ప్రశ్న వేశాడు ''నేనుమీకునచ్చానా?''

ఊహించని ప్రశ్న. కానీ ఊహించిన క్లయిమాక్స్‌కి ఆధారం.

ఒక్కసారి రూమంతా కలియ జూసింది. ఒక కుర్చీలో అన్న. ఒక మూలన అమ్మమ్మ. అందర్నీ ఒకే సమాధానంతో దెబ్బతీయడానికి తయారయింది.

''నచ్చలేదు'' అని చెప్పి నెమ్మదిగా లేచి పక్క గదిలోకెళ్ళిపోయింది.

తర్వాత ఏమవుతుందో తనూహించినట్లే జరిగింది.

అతనికి క్షమాపణలు చెప్పి పంపేసి, తన మీదకి దూకారు అమ్మమ్మ,అన్న.

తన సమాధానం మాత్రం మౌనం.

'ఇంకా ఎంత మంది ముందు తను తలొంచుకు కూర్చోవాలో? మగవాళ్ళందరూ అవకాశవాదులే.

సరికొత్త ఉదాహరణ బావే!'

ఒక్కసారి సీత కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి.

బావతో తను ఆనందంగా గడిపిన సమయం ఇలా వృధా అవుతుందని కలలో కూడా వూహించలేదు.

ఆలోచనలు తన ఈరోజు స్థితికి కారణాలు వెతుక్కుంటూ గతంలోకి జారుకున్నాయి...

''బావా నీకు జాబ్ వచ్చిందిగా పార్టీ ఎపుడు'' అడిగింది సీత శేఖర్‌ని.

''నా పెళ్ళిలో ఇస్తాను'' నవ్వుతూ చెప్పాడు శేఖర్.

సీత 'ఆరవ జ్ఞానం' అపశకునాన్ని సూచించింది. బావ కళ్ళల్లోకి సూటిగా ఆశ్చర్యం, కోపం మిళితమైన చూపు చూసింది.

''కంగారు పడకు సీతా! నా పెళ్ళి అంటే మన పెళ్ళి అనే నా ఉద్దేశం. నీకు పార్టీ నేనే''


సీత బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కాయి.

''పోబావా! నువ్వేమైనా పుల్లారెడ్డి స్వీటువా? కాకినాడ కాజావా? డోలప్స్ ఐస్‌క్రీమ్‌వా? నువ్వు పుట్టిందే నాకోసమైనపుడు నా పార్టీ కాక ఎవరిపార్టీవవుతావు? నాకు మంచి పార్టీ ఇవ్వాల్సిందే''

''సరే! అలాగే! ఏం పార్టీ కావాలో కోరుకో''

''హైద్రాబాద్ మీ ఇంటికొచ్చినపుడు ఒక రోజంతా నేను అడిగినవన్నీ చూపిస్తూ, కొనిస్తూ, నాకు కోపం రాకుండా చూడాలి. నేను అడిగింది ఏది ఇవ్వకపోయినా, నాకు కోపం వచ్చినా మళ్ళీ ఇంకో రోజు పార్టీ ఫ్రెష్‌గా మొదలు పెట్టాల్సిందే!''

''ఓకే! డన్! కానీ ఒక షరతు! నేను పార్టీ మొదటి సారే ఓడిపోకుండా ఇవ్వగల్గితే నువు కూడా నాకు పార్టీ ఇవ్వాలి''



మీరు బాగా ఇష్టపడేవి?

* అప్పుడే పితికిన పాలతో పెట్టిన కాఫీ తాజాదనం నాకెంతో ఇష్టం

– బాలకృష్ణ

''ఎలాంటి పార్టీ?'' అడిగింది సీత.

''ముందు నేను చెప్పబోయే చిక్కు కథకు ఆన్సరు చెబితే ఎలాంటి పార్టీనో నీకే తెలుస్తుంది.''

ఆసక్తిగా అడిగింది సీత. ''ఏమిటో చెప్పు''

''జాగ్రత్తగా విను. అన్ని వేపులా మూసివున్న ఒక అట్ట పెట్టెలో అనుకోకుండా మూడు తేనెటీగలు చిక్కుకున్నాయి. వాటిలో రెండు మగవి–ఒకటి ఆడది. పాపం ఆడ తేనెటీగకి బయటికెళ్ళాలన్పించి ఒక మగదాన్ని అడిగింది ''కొంచెం బయటికెళ్ళడానికి త్రోవ చూపిస్తావా'' అని.

వెంటనే ఆ మగ తేనెటీగ ''నువ్వు నాకొక ముద్దిస్తే చూపిస్తా'' అంది. ఆ తర్వాత సహజంగానే మగది ఆ ఆడదాన్ని మోసం చేసింది 'నేను చెప్పను పో' అని.''

పూర్తిగా కథలో నిమగ్నమైన సీత అడిగింది ''అది తర్వాత పగతీర్చుకుందా?'' అని.

''పూర్తిగా విను. ఆ తర్వాత అది రెండో మగ తేనెటీగ దగ్గరకెళ్ళి త్రోవ చూపించమని అడిగింది.

అది కూడా ముద్దు పెట్టించుకుని మొదటి దాని లాగే మోసం చేసింది.''

''అందుకే మగ తేనెటీగలు త్వరగా చస్తాయ్'' ఆవేశంగా అంది సీత.

''నీ ఆవేశం చూస్తుంటే హైద్రాబాద్ వచ్చి 'మహిళా జనోద్ధరణ' సంఘం లాంటిదేదో పెట్టేటట్టున్నావే? ఇది నేను కావాలని కల్పించిన ఒక చిన్న కథ''

''తర్వాతేమైంది'' కథలో నుండి తేరుకోకుండా అడిగింది.

''ఆ ఆడ తేనెటీగ శుభ్రంగా బయటికొచ్చి స్వేచ్ఛా వాయువులు పీల్చుకొనడం మొదలు పెట్టింది.''

''అదెలా? అది అసలు బయటికెలా వచ్చింది'' టెన్షన్‌తో అడిగింది.

''ఆలోచించు'' కూల్‌గా అన్నాడు శేఖర్.

''ప్లీజ్! చెప్పు ఎలా బయటికొచ్చింది'' అడిగింది సీత.

వచ్చిన చాన్స్ వదులుకోదల్చుకోలేదు శేఖర్.

''నువ్వొక ముద్దిస్తే చెప్తాను'' సీత కళ్ళల్లోకి చూస్తూ, ఆమె ఫీలింగ్స్ గమనిస్తూ అన్నాడు శేఖర్.

తనని ట్రాప్ చేసాడని గ్రహించింది సీత.

సిగ్గుపడకుండా ''నువు పార్టీ సక్సెస్‌ఫుల్‌గా ఇచ్చిన రోజున మరుక్షణమే నీ కోరిక తీరుస్తాను మైడియర్ బావా!'' శేఖర్ వీపు మీద మెల్లిగా 'పేట్'చేస్తూ చెప్పింది సీత.

''సీతా! ఈ కథలో చిన్న చిదంబర రహస్యం వుంది. గమనించావా?''

''ఏమిటది?'' పజిలింగ్‌గా అతని కేసి చూస్తూ అడిగింది.

''పెళ్ళి చూపుల ఆచారం మూసివున్న అట్టపెట్టె అయితే, పెళ్ళి కూతురు కళ్ళతో అడిగే ప్రశ్న–పుట్టినింటినుండి మెట్టినింటికి త్రోవ అయితే 'మగ' పెళ్ళి కొడుకు అడిగేది ముద్దుగా 'కట్నం'.

ఎంత మంది 'త్రోవ' చూపించకపోయినా మళ్ళీ అదే ప్రశ్న వేయటానికి ఎంత మంది అమ్మాయిలు రెడీ అయిపోవటం లేదు?''

''దాసరి సినిమాలు ఎక్కువ చూస్తావా బావా?''

''జోక్ కాదు సీతా! నీకు ఈ బాధలన్నీ తప్పించి ఒక త్రోవ చూపించాలనే, ఉద్యోగం రాగానే నీ దగ్గరకొచ్చాను'' అంటూ సీత చెయ్యిని సున్నితంగా నొక్కాడు శేఖర్.

సీత కళ్ళలో ఆనందం మెరుపులా మెరిసింది.

''బావా! ఐ లవ్ యూ బావా!'' శేఖర్ కుడి చేతిని తన బుగ్గ మీద వుంచుకొని అంది సీత.

''నాన్నను,బామ్మను కూడా ఒప్పించాను. త్వరలోనే మన పెళ్ళి''

శేఖర్ వున్న నాలుగు రోజులు క్షణాల్లా గడిచిపోయాయి.

శేఖర్ వెళ్ళిన తర్వాత మొదలైంది సీత కష్టాల పరంపర.

ఒక రోజు సీత అన్న పిడుగు లాంటి వార్త తెచ్చాడు.

''నాన్న గార్కి కేన్సరుట. ఆరు నెలల కంటే బ్రతకరట. డాక్టరు చెప్పాడు.''

ఆ తర్వాత నాలుగు నెలలకు సీత అన్న ఒకమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకుని ఇంటికి తెచ్చాడు.

సీత వదిన వున్న మూడు రోజుల్లో అందరితో తగాదాలు, పోట్లాటలు వెళ్ళేటపుడు ''మామయ్యగారికి వచ్చే డబ్బులో సగం మాకివ్వాలి. ఆయన గారి వుద్యోగం మా ఆయనకే వస్తుంది'' అని వార్నింగు ఇచ్చి వెళ్ళింది.

సీతకు అన్న, వదినలను చూస్తే అస

హ్యామేసింది. వెంటనే అమ్మమ్మకు పూసగుచ్చినట్టు అన్ని వివరాల్తో ఉత్తరం రాసి పడేసింది.

సీతకు 'అమ్మమ్మ' తెలివి తేటల మీద అపారమైన నమ్మకం. ''ఇందిరా గాంధీ చచ్చిపోయిన టైములో మా అమ్మమ్మ ఢిల్లీలో వుండి వుంటే ప్రధాన మంత్రి అయిపోయేది'' అని అందరి దగ్గర గర్వంగా ఆమె గురించి చెప్పుకొనేది సీత.

ఉత్తరం అందగానే అమ్మమ్మ వచ్చేసింది.

అమ్మమ్మ వచ్చిన కొన్ని రోజులకు సీత తండ్రి ఉద్యోగం నుంచి రిటైరవ్వక ముందే శాశ్వతంగా జీవితం నుంచి రిటైరైపోయారు.

అంత్యక్రియలకు హైదరాబాద్ నుంచి అందరూ వచ్చారుకానీ బావ రాలేదు. సీత మనసు కీడు శంకించింది.

వస్తాడనుకున్న బావ బదులు పిడుగు లాంటి వార్త మోసుకుంటూ వుత్తరం వచ్చింది.

ఆ ఉత్తరంలో ''సీతా! అనివార్య కారణాలవల్ల నేను నిన్ను పెళ్ళిచేసుకోలేను'' అన్న వాక్యం ఆమె మనసులో పెను తుపాను రేపింది.

వెంటనే అమ్మమ్మకు ఉత్తరం చూపించింది.

''అవును నేనే నీకిట్లా ఉత్తరం వ్రాయమని చెప్పొచ్చాను. నిన్ను చేసుకుంటే వాడికేమొస్తుంది?

కట్నం వస్తుందా? స్టేటస్ వస్తుందా? నీ ముగ్గురు చెల్లెళ్ళ బాధ్యతతో వాడు కష్టాలు కొని తెచ్చుకోవడం నాకిష్టం లేదు. నీకు గంతకు దగ్గ బొంత దొరక్కపోదు. పెళ్ళి జరగకపోదు.''

దయలేని, ఫుల్‌స్టాప్ లేని అమ్మమ్మ మాటల్తో సీతకు భవిష్యత్తు శూన్యంలా తోచింది.

బావ దూరమైపోతున్నాడనే బాధతో ఏడుపు ముంచుకొచ్చింది. ఆవేశం కట్టలు తెంచుకుంది.

''ఇదంతా నీ ప్లానే అని నాకూ తెల్సు'' అంటూ మొదలుపెట్టి అమ్మమ్మ మీద అరగంట రెచ్చిపోయింది సీత.

సీత అన్న, వదినా టీవీ సీరియల్ చూస్తున్నట్టు లీనమై వాళ్ళిద్దర్నే చూస్తున్నారు.

సీతని ముగ్గురు చెల్లెళ్ళు వచ్చి దూరంగా తీసికెళ్ళారు.

కర్మకాండ పూర్తి అయిన తర్వాత అమ్మమ్మ పెద్ద మనుషులందరిలో సమావేశం ఏర్పాటు చేసింది.

అన్న వదినలు ఒక వైపు.

అమ్మమ్మ, కుటుంబ సభ్యులు, పెద్ద మనుషులు ఒక వైపు.

గంభీరమైన నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ 'అమ్మమ్మ' సీత అన్నతో అంది. ''ఏరా! మీ నాన్న ఉద్యోగం నీకు కావాలా? సీతకు ఇప్పిద్దామా?''

''న్యాయంగా అయితే మా ఆయనకే రావాలి'' వదిన మాట్లాడింది. అన్న బదులు.

''చూడమ్మా! మా అబ్బాయిలు హైదరాబాద్‌లో కనుక్కున్నారు–మీ ఆయన చదువుకి గుమాస్తాగిరి వస్తుందిట. దానికి ఉద్యోగం వుంటే ఎవడో ఒకడు పెళ్ళి చేసుకుంటాడు. శేఖరుడు కూడా దానిని పెళ్ళిచేసుకోవడం లేదని స్పష్టం చేశాడు.''

అమ్మమ్మని సపోర్టు చేస్తూ చాలా మంది పెద్దలు ఎవరికి తోచిన విధంగా వారు చెప్పారు.

అందరూ సీత బావ శేఖర్‌ని విపరీతమైన ధోరణులలో విమర్శించారు సీతని పెళ్ళిచేసుకోనందుకు.

సీతకు శేఖర్‌ని తిడుతుంటే కోపం వచ్చింది. ''నా ఖర్మగానీ, శేఖర్ తప్పేముంది'' అనుకొంది మనసులో.

''మా ఆయనకి ఇపుడే రెండు వేల జీతం వస్తుంది. ఆ గుమస్తాగిరో, టీచరు వుద్యోగమో సీతకే ఇప్పించుకోండి. మరి డబ్బుల సంగతి ఏంటో తేల్చండి'' ఇంటి కోడలి అధికారంలో అడిగింది వదిన.

అందరి మొహాల్లో ఆవిడంటే ఒక ఏహ్య భావం కనబడింది. అమ్మమ్మ అందుకుంది–''మీ మామగారు చేసిన అప్పులు పోను మిగిలిన డబ్బు ముగ్గురు ఆడపిల్లల కట్నాల కింద సరిపోతుంది. సీతకీ ఉద్యోగమే కట్నం అవుతుంది. మీ అత్తగారి బాధ్యత మాది. మిగిలే డబ్బు ఏముంది? రూల్సు మాట్లాడితే ఈ బాధ్యతలన్నీ మీ ఆయనవే.''

పెద్దలందరూ లెక్కలు చూసి అమ్మమ్మ మాటలనే సమర్థించారు.

వదిన, అన్న చాలాసేపు వాదనల తర్వాత కోపంగా వాకవుట్ చేసి వెళ్ళారు.

అమ్మమ్మ, అమ్మకు తోడుగా మాకు సహాయంగా ఇక్కడే వుండిపోయింది.

బావ రాలేదు. ఉత్తరం రాయలేదు.

ఇవ్వాళ హఠాత్తుగా అమ్మమ్మ పెళ్ళి చూపులు ఏర్పాటు చేయించింది. అన్నయ్య వాళ్ళను కూడా పిలిపించింది. వదిన రాలేదు.

''సీతా! నే వెళ్ళొస్తా. నీ పద్ధతి మార్చుకోకపోతే నీకీ జన్మలో పెళ్ళి కాదు'' అంటూ దీవించి వెళ్ళిపోతున్న అన్న మాటల్ని విని ఈ లోకంలోకి వచ్చింది సీత.

సీతకి ఆ రాత్రి అన్నం తినబుద్ధి కాలేదు. ఖాళీ కడుపుతో మెదడు నిండా ఆలోచనల్తో మంచం పైన పడుకొని వున్న సీత పక్కలో అమ్మమ్మ వచ్చి కూర్చుంది.

సీత అటుతిరిగి పడుకుంది.

''సీతా! బావతో నీ పెళ్ళి జరిపిస్తే నా మీద కోపం పోతుందా?'' లాలనగా అడిగింది. ప్రేమ ఆమె మాటల్లో రంగరించి మాట్లాడింది.

సీత కోపంలో ఆమె మాటల్లో ప్రేమని కాచ్ చెయ్యలేక పోయింది.

చివ్వున లేచి కూర్చుని ''సినిమాల్లో రావుగోపాలరావు పాత్ర తీసుకుని బతకాల్సిన దాన్ని పొరపాటున దేవుడు మా అమ్మమ్మగా పుట్టించాడు'' అంది సీత.

అమ్మమ్మ పెద్దగా నవ్వింది.

''పిచ్చిపిల్లా! ఇప్పటివరకూ నేనాడిన నాటకం మీ అందర్నీ మీ అన్నా వదినల కబంధ హస్తాల నుండి రక్షించడానికేనే! నీకు ఉద్యోగం ఒక నెలలో వస్తుందట. పెద్ద బావ వుత్తరం రాశాడు. నీ పెద్ద చెల్లెలుకి కూడా సంబంధం చూశాడుట. మీ ఇద్దరికీ ఒకేసారి పెళ్ళి చేసేస్తే సగం బాధ్యత తీరిపోతుంది.''

''మరి బావ నన్ను చేసుకోనన్నాడుగా'' వణికే స్వరంతో అడిగింది సీత.

''వాడ్ని అట్లా వుత్తరం వ్రాయమంది నేనే. మీ నాన్న వుద్యోగం నీకిప్పించటానికి వేసిన ప్లాను అది. శేఖర్ నిన్ను చేసుకుంటానంటే 'వాడికి వుద్యోగం వుందిగా–మళ్ళీ సీతకెందుకు? ఉద్యోగం నాకే కావాలి' అని పేచీ పెడ్తాడని ఈ మెలిక పెట్టాను.''

సీతకు సంతోషంతో మాటలు రావడం లేదు.

''నీకు ఉద్యోగం ఇప్పించింది మీరు కులకటానికి కాదు. మీ చెల్లెళ్ళని నీ జీతంతో చదివించాలి. వాళ్ళ పెళ్ళిళ్ళ టైముకి కట్నాలు పెరిగి డబ్బు చాలకపోతే నువ్వు ఆదుకోవాలి. ఆ తర్వాత మీ అమ్మ బాధ్యత మీ ఇద్దరిదే'' ఈ విషయం అమ్మమ్మ కొంచెం నొక్కి చెప్పింది.

''మరి మధ్యలో ఈ పెళ్ళి చూపుల గొడవెందుకో'' సీత ఆ పాయింటు అర్థం కాక అడిగింది.

''మొన్నీమధ్య ఉద్యోగం తనకే కావాలంటూ రాయబారం పంపాడు నీ అన్న. అందుకే మనం ఎన్ని కష్టాల్లో వున్నామో, నీకు పెళ్ళి చెయ్యడం మాకెంత కష్టమో చూపించడానికి ఆ పెళ్ళిచూపుల తంతు'' సింపుల్‌గా చెప్పేసింది అమ్మమ్మ.

అమ్మ పిలవటంతో అమ్మమ్మ మళ్ళీ వస్తానంటూ వెళ్ళింది.

ఇపుడు సీతకి పూర్తిగా అర్థమైంది అమ్మమ్మ ప్లాను.

ఇన్నాళ్ళూ అమ్మమ్మతో మాట్లాడనందుకు, మనసులో ఆమెని చాలా సార్లు తిట్టుకొన్నందుకు చాలా బాధగా వుంది.

ఇపుడు సీత ఆలోచనల నిండా అమ్మమ్మే.

ఆమె జీవిత మంతా కష్టాల మయం. ఎంతో సహనంతో గుట్టుగా ఇన్నాళ్ళు సంసారాన్ని నెట్టుకొచ్చింది. తన పిల్లల్నీ, పిల్లల పిల్లల్నీ ఎంతో నేర్పుగా పెంచి ఒక దారిలో పెట్టింది. అన్ని సమస్యలకూ పరిష్కారం తనే. అందుకే అమ్మమ్మంటే అందరికీ భయంతో కూడిన ఆరాధన.

బయట ప్రపంచం చూడకుండా, పుస్తకాలు చదవకుండా ఏ విషయంలోనైనా చక్రం తిప్పగల నేర్పు అమ్మమ్మ స్వంతం. ఒక స్త్రీ శక్తి సమాజానికి ఉపయోగ పడకుండా పరిస్థితులు అణగద్రొక్కేసాయి.

అందుకే సీత దృష్టిలో అమ్మమ్మ 'సూరీడు చూడని వెలుగు'. ఇపుడు సీత ధ్యేయం–స్త్రీ శక్తిని వృధా కానీయకుండా సమాజానికి ఉపయోగపడేలా మలచడం ఒక్కటే!